## క్లుప్తంగా...

### రాష్ట్రపతిని కలిసిన వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం నాయకులు



రాష్ట్రపతికి మెమొంటోను అందజేస్తున్న వెన్న ఈశ్వరప్ప, శెట్టి శివకుమార్ తదితరులు

అబిడ్స్: రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం నాయకులు కలిశారు. రాష్ట్ర బలిజ సంఘం అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, ధినేష్ పాటీల్, కల్లెపల్లి రాచప్పతో పాటు పలువురు నాయకులు న్యూ ఢిల్లీలో కలిసి మెమొంటోను అందజేశారు. అదేవిధంగా జనవరిలో కలువ మల్లికార్జునప్ప ఆవిష్కరణ చేయబోవు బసవకృప మాసపత్రిక సిల్వర్ జూబ్లీ సావనీర్‌కు సందేశాన్ని ఇవ్వాలని రాష్ట్రపతిని వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో శివరత్నం, మల్లికార్జునప్ప, కర్నె రాజశేఖర్, మధుసుదన్, సోమేశ్వర్, మిరియాల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

### ఆత్మీయ సత్కారం



వీరేశంను సన్మానిస్తున్న మహ్మద్ సలీం అహ్మద్

చార్మినార్: సామాజిక సేవ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్న సీనియర్ అడ్వొకేట్ ఎం.వీరేశంను సుజాయ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ సలీం అహ్మద్ అన్నారు. శుక్రవారం కొత్తగా ఏర్పాటు చేసిన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా మహ్మద్ సలీం ఆయనకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయపరమైన సమస్యలతో సతమతమయ్యే పేద ప్రజలకు వెన్నంటే ఉండే వీరేశం అభినందనీయులన్నారు. ఆయనను కలిసిన వారిలో జూనియర్ అడ్వొకేట్ సత్యజీత్ తదితరులు ఉన్నారు.

### ప్రతిభా పురస్కారాల సభను జయప్రదం చేయాలి



జార్జ్ పాల్

చాంద్రాయణగుట్ట: ప్రైవేట్ టీచర్ల ప్రతిభా పురస్కారాల సభను జయప్రదం చేయాలని టీపీయూఎస్ కార్యదర్శి జార్జ్ పాల్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. టీపీయూఎస్ ఆధ్వర్యంలో వచ్చే వారంలో నిర్వహించే సభకు విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ప్రైవేట్ టీచర్లకు న్యాయం జరిగేలా యూనియన్ తరఫున ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. టీచర్లకు అండగా ఉంటున్న బీఆర్ఎస్ సర్కార్‌కు మద్దతు తెలిపే ప్రక్రియ కూడా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

### శివలింగానికి విశేష పూజలు



డబీర్‌పురా: కోమటివాడిలోని రామాలయంలో శివలింగానికి 100 కేజీల విభూదితో విశేష పూజా కార్యక్రమాలను బొంగులూరి రాంమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### రేపు తిరంగా బైక్ ర్యాలీ



దీపేశ్ రాజ్ వర్మ

చార్మినార్: 17న జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించనున్నట్లు చార్మినార్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ మజ్లిస్ పార్టీ నాయకుడు దీపేశ్ రాజ్ వర్మ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి నాంపల్లిలోని యూసుఫియన్ దర్గా నుంచి తిరంగా బైక్ ర్యాలీ ప్రారంభమై శాంతినగర్‌లోని హాకీ గ్రౌండ్‌కు చేరుకుంటుందన్నారు. ఈ తిరంగా బైక్ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

### ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



డబీర్‌పురా: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు స్థానికులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు పాతబస్తీలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా ఉన్న మట్టి వినాయకులు

చార్మినార్: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం జీహెచ్ఎంసీ పరిధిలో 17వ తేదీ వరకు వార్డుల వారీగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఓ ప్రకటనలో తెలిపారు. వార్డుకు 2,500 చొప్పున ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రతి సర్కిల్‌కు ఒక ఏఎంహెచ్‌ను ఇన్‌చార్జిగా, ప్రతి వార్డుకు వార్డు ఆఫీసర్‌ను ఇన్‌చార్జిగా నియమించామని కమిషనర్ తెలిపారు. సంతోష్‌నగర్ సర్కిల్‌లోని రెయిన్‌బజార్, తలాబ్‌చంచలం, కుర్మగూడ, ఐ.ఎస్.సదన్, సంతోష్‌నగర్‌లలో జీహెచ్ఎంసీ ద్వారా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. హెచ్ఎండీఏ ద్వారా గౌలిపురాలోని వేద ధర్మ ప్రకాశ్ స్కూల్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ద్వారా మొత్తం 16,800 విగ్రహాల పంపిణీ చేయనున్నామన్నారు. చాంద్రాయణగుట్ట సర్కిల్‌లోని లలితాబాగ్, రియాసత్‌నగర్, కంచన్‌బాగ్, బార్కాస్, చాంద్రాయణగుట్ట, ఉప్పుగూడ, జంగమ్మెట్ వార్డులలో ఈనెల 16, 17వ తేదీల్లో మొత్తం 17,500 వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తారన్నారు. చార్మినార్ సర్కిల్‌లోని పత్తర్‌గట్టి, మొఘల్‌పురా, శాలిబండ, ఘాన్సీబజార్, పురానాపూల్ వార్డులలో ఈనెల 16, 17వ తేదీల్లో మొత్తం 12,500 వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ చేయనున్నామన్నారు. ఫలక్‌నుమా సర్కిల్‌లోని ఫలక్‌నుమా, నవాబ్‌సాబ్‌కుంట, దూద్‌బౌలి, జహనుమా, రామ్నాస్‌పురా, కిషన్‌బాగ్ వార్డులలో ఈనెల 16, 17వ తేదీల్లో మొత్తం 15,000 వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నామన్నారు.

## 'కలం యోధుడు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ పాత్రికేయుడు కె.రాంచంద్రమూర్తి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రపంచం యుద్ధం సమయంలో ప్రపంచ దేశాల తీరుతెన్నెలను విశ్లేషించి వ్యాసాలు రాసిన కోటం రాజు రామారావు జర్నలిజంలో ఆయన పాత్ర చిరస్మరణీయంగా నిలిచి ఉంటుందని ప్రముఖ పాత్రికేయుడు డాక్టర్ కె.రాంచంద్రమూర్తి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి సి.భవాని దేవి రచించిన 'కలం యోధుడ' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కోటం రాజు రామారావు జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావడం వల్ల ఎంతో మంది యువ జర్నలిస్టులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్, ఉదయవర్లు, దాసు కేశవరావు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న చిన్మయి కూచిపూడి రంగప్రవేశం



గన్‌ఫౌండ్రీ: జై ఆనంద కూచిపూడి డ్యాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు అనిత శిష్యురాలు గరజాల చిన్మయి కూచిపూడి నాట్యరంగ ప్రవేశం శుక్రవారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గణేష పంచరత్నం, రాజేశ్వరి హస్తకం, బామ కళాపం వంటి పలు అంశాలపై చక్కాటి హావభావాలతో కలిగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారథి, వ్యవసా శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు, షీ టీమ్ అడిషనల్ డీజీపీ షికా గోయల్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, చిన్మయి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల తరలింపునకు సహకరించండి



రాకేశ్ తివారీ

చార్మినార్: వినాయక విగ్రహాలను నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను పాతబస్తీకి తరలించేటప్పుడు కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ రాకేశ్ తివారీ అన్నారు. పురానాపూల్, సిటీ కాలేజీ చౌరస్తా నుంచి మూసాబౌలి చౌరస్తా, మోతీగల్లీ ద్వారా చౌమహల్లా ప్యాలెస్ రోడ్డు నుంచి ముందు వస్తూ ఆయా మండపాలకు చేరుకోవడానికి ఉత్సవాల నిర్వాహకులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే గోతులు ఏర్పడి శిథిలావస్థకు చేరిన చౌమహల్లా ప్యాలెస్–ఖిల్వత్ రోడ్డు మార్గం ద్వారా సాఫీగా ముందుకు వెళ్లలేకపోతున్నారన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయ మార్గమైన మదీనా, పత్తర్‌గట్టి, గుల్జార్‌హౌజ్, చార్మినార్, శాలిబండ రోడ్డు మీదుగా అనుమతించాలన్నారు. పరిస్థితిని అంచనా వేసి అనుమతించాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యతో పాటు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్నను కోరారు.

### సన్మానం



నాటక రచయితలను సన్మానిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

నాంపల్లి: ప్రముఖ నాటక రచయితలు, దర్శకులు డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్‌కు శుక్రవారం నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో సత్కారం జరిగింది. లతా రాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కారం చేశారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అంగలకుర్తి విద్యాసాగర్ సదస్సును ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మూర్తిదేవి పురస్కార గ్రహీత, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, గౌరవ అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బలరామయ్య, ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ లక్ష్మీనర్సయ్య హాజరై ప్రసంగించారు. సభా ప్రారంభంలో ఆధునిక సామాజిక దీపికలైన పడమటిగాలి, రాజుగాడు రాజయ్యాడు అనే నాటకాల నుంచి కొన్ని సన్నివేశాలను ప్రదర్శించారు. లతా రాజా ఫౌండేషన్ ట్రస్టీలు కె.కె.రాజా, పీఎస్ఎన్.మూర్తి, డాక్టర్ ఎన్.సిద్ధోజీరావు, అశ్విన్ అనిల్, పి.సుభాష్, రాజా అంజన, సంజన పాల్గొన్నారు.

### అన్నివర్గాల ప్రజలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



సమావేశంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: అన్నివర్గాల ప్రజలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. జలక్షత్రియా ఫిష్ మార్కెట్ అసోసియేషన్ నూతనంగా కమిటీ ఏర్పడిన సందర్భంగా నందకిశోర్ వ్యాస్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌సింగ్, ఫతే సింగ్, శివదర్శన్ సింగ్, ఠాకూర్ సింగ్, సర్దార్ సింగ్, శ్యామ్ సింగ్, సతీష్ సింగ్, సంతోష్ సింగ్, పప్పుమాత్రే, ప్రదీప్‌రాజ్, జైపాల్ సింగ్, సుర్దీప్ సింగ్ పాల్గొన్నారు.

### 'డబుల్' ఇళ్ల పంపిణీ పారదర్శకంగా జరపాలి

అఫ్జల్‌గంజ్: పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ పారదర్శకంగా జరపాలని సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్, గోషామహల్ కన్వీనర్ నాగేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కిషన్‌గంజ్‌లోని కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేవలం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారే కాకుండా మండల కార్యాలయంతో పాటు కలెక్టర్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారిని సైతం పరిగణలోకి తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు అత్యంత నిరుపేదలు, వికలాంగులు, ఒంటరి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నాయకులు కోటయ్య, మీనా, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్, నాగేశ్వర్ తదితరులు

### జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో మంత్రి తలసాని, నిర్వాహకుడు శ్రీనివాస్‌యాదవ్

సుల్తాన్‌బజార్: రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రాంకోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో గడ్డం గంగాధర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు మంత్రి హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా 1.95 లక్షల ఉద్యోగాలను టీఎస్పీఎస్సీ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖలలో భర్తీ చేసిందని తెలిపారు. ఇంత పెద్ద జాబ్‌మేళాను ఏర్పాటు చేసిన హైందవి విద్యా సంస్థల నిర్వాహకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను మంత్రి అభినందించారు. వివిధ సంస్థలలో జాబ్‌లకు ఎంపికైన అభ్యర్థులకు మంత్రి నియామక పత్రాలను మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్‌తో కలిసి అందజేశారు.

### 'కేసీఆర్ దేశంలోనే నెంబర్ వన్ సీఎం'



మాట్లాడుతున్న మిత్ర కృష్ణ

గోల్కొండ: కేసీఆర్ దేశంలోనే నెంబర్ వన్ సీఎం అని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. ఈనెల 16న జరగనున్న సీఎం కేసీఆర్ పాలమూరు బహిరంగ సభకు తరలివెళ్లడానికి గురువారం గుడిమల్కాపూర్ బీఆర్ఎస్ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గం నుంచి సీఎం కాన్వాయ్‌లో భారీ ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి వెళ్తారన్నారు. వైద్య కళాశాలల ఏర్పాటులో కేసీఆర్ ఎంతో గొప్ప నిర్ణయం తీసుకున్నారన్నారు. గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, వెంకటేష్, శేఖర్‌రెడ్డి, శ్రీధర్‌సాగర్, రాములు, రఘు తదితరులున్నారు.

### గోషామహల్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం



సమావేశంలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీకి గోషామహల్ నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకువచ్చి కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేర్కొన్నారు. పీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జాంబాగ్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 17న తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలిరావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. నిర్మల్‌కుమార్ యాదవ్, అనిల్‌సింగ్, సికె.మూర్తి సంజయ్‌యాదవ్, ప్రేమ్‌లాల్, కన్నయ్యలాల్, శ్యామ్‌సింగ్, శ్రీధర్ గౌడ్ కైలాష్ సింగ్, ఇస్మాయిల్, ఖదీర్, నరేందర్, రణవీర్, జితేందర్, కిషన్ పాల్గొన్నారు.

### తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రలో మరుపురాని ఘట్టం

– సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నాంపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలో మరిచిపోలేని ఘట్టమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తెలిపారు. స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోసం సీపీఐ భారతదేశంతో పాటు హైదరాబాద్ రాష్ట్రంలో కూడా అనేక పోరాటాలు చేసిందని, అనేక మంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగాలు చేశారని తెలిపారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలు అప్పుడు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 75 వసంతాల వజ్రోత్సవాలలో భాగంగా హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్ద శుక్రవారం సీపీఐ హైదరాబాద్ జిల్లా ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఛాయా చిత్ర ప్రదర్శనను సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్.బోస్, ఈటీ నరసింహ, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్ రాష్ట్ర సమితి సభ్యులు వెంకటేశం, ప్రముఖ సంఘ సేవకులు మోటూరి కృష్ణ ప్రసాద్‌లతో కలిసి డాక్టర్ కె.నారాయణ ప్రారంభించి తిలకించారు. ప్రేమ్‌పావని, శంకర్‌నాయక్, శ్రీకాంత్, నళిని పాల్గొన్నారు.

### ఉస్మానియాలో డయాబెటిక్ రోగులకు మెరుగైన చికిత్స



అఫ్జల్‌గంజ్: డయాబెటిక్ రోగులకు ఉస్మానియాలో మెరుగైన చికిత్సలు అందిస్తున్నట్లు ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలోని డయాబెటిక్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డయాబెటిక్ ఫుట్ కేర్ క్లినిక్‌లో లెప్రా సొసైటీ ద్వారా రోగుల పాదాల ఫూట్ ప్రింట్ తీసి హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సాయంతో రోగులకు అవసరమైన ప్రత్యేక పాదరక్షలను పూర్తి ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.

## బస్తీ దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలు



టోలిచౌకి బస్తీ దవాఖానాలో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: బస్తీ దవాఖానాలలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్‌లలోని బస్తీ దవాఖానాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన టోలిచౌకి బస్తీ దవాఖానాలో ఆరోగ్యాధికారి, సిబ్బందిని ఆస్పత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆస్పత్రి వైద్యులు ఔట్ పేషంట్ల సంఖ్య పెరుగుతుందని విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తమకు సరిపడా మందులను సరఫరా చేస్తుందని అన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైతే గోల్కొండ ఏరియా ఆస్పత్రికి పంపించాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన అహ్మద్ కాలనీలో పర్యటించారు. డాక్టర్ శ్రీహర్షయాదవ్, జలమండలి డీజీఎం ఖాజా జవహర్ అలీ, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, బదరుద్దీన్ తదితరులున్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన



నాలా పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రోనాల్డ్ రోస్

యాకుత్‌పురా: గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్‌తో కలిసి శుక్రవారం రెయిన్‌బజార్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. యాకుత్‌పురా రైల్వే స్టేషన్, జాఫర్ రోడ్డు, గంగానగర్ నాలా, మౌలా కా చిల్లా, మదినానగర్, ధోబీఘట్, ఎస్ఆర్టీ కాలనీ, యక్రఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా, డ్రైనేజ్, రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ పనుల పురోగతిపై సంబంధిత ప్రాజెక్ట్స్, ఇంజినీరింగ్ అధికారులతో ఆరా తీశారు. పలు ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రహమత్ బేగ్ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను కోరారు. పనుల్లో వేగం పెంచి సాధ్యమైనంత త్వరలో పూర్తి చేయాలని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. రెయిన్‌బజార్, పత్తర్‌గట్టి కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి. వెంకన్న, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ప్రాజెక్టు ఈఈలు, ఇంజినీరింగ్ విభాగాల ఈఈలు, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య విగాభాల అధికారులు పాల్గొన్నారు.

### 'రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే'



బండి సంజయ్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా అత్యధిక స్థానాలు గెలిచి బీజేపీ అధికారంలోకి వస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీ పటిష్టంగా ఉందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో పార్టీ అనుబంధ విభాగాలు క్రమశిక్షణతో పార్టీ గెలుపు కోసం పని చేస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. బీజేపీ నుంచి టికెట్ ఎవరికి ఇచ్చామన్నది ప్రధానం కాదని టికెట్ ఎవరికి ఇచ్చినా కూడా అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

### బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో అభివృద్ధి శూన్యం

గోల్కొండ: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ పూర్తిగా వెనుకబడిపోయిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురకుల కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ దేశానికి చేసిన సేవలు, కాంగ్రెస్ హయాంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అభివృద్ధిని వివరించారు. నేడు రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కలిసి ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని అన్నారు. నాయకులు అబ్దుల్ హమీద్, రవీందర్, రాములు, చంటిబాబు తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్ నాయకులతో కృష్ణ తదితరులు

## ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

అబిడ్స్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ ఆర్.శంకర్ రాజు పేర్కొన్నారు. అబిడ్స్‌లోని స్టాన్లీ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు, సిబ్బందికి అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లంకల రవికుమార్‌తో కలిసి ఆయన ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు కానీ, పెద్ద వారు కానీ రాంగ్ రూట్‌లో వెళ్లడంతో పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వరూపరాణి, సిబ్బంది సంధ్య, రజని, టీటీఐ బేగంపేట సిబ్బంది శ్రీధర్, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

## దారి దోపిడీకి పాల్పడిన నిందితుల అరెస్ట్



చాంద్రాయణగుట్ట: ఆటోలో ఆస్పత్రికి వెళ్తున్న వారిని కత్తితో బెదిరించి దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని హుస్సేనీ ఆలం పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, అదనపు డీసీపీ షేక్ జహంగీర్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. తలాబ్‌కట్టకు చెందిన సయ్యద్ వాజిద్ అలీ అలియాస్ వర్గా యాదవ్(26) పక్క పిన్నీస్‌లు విక్రయిస్తుంటాడు. 12 కేసులలో నిందితుడిగా ఉన్న వాజిద్ అలీ ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యాడు. కళ్లద్దాలు విక్రయించే తనకు మిత్రుడైన మహ్మద్ ఇక్బాల్(24)తో కలిసి జుమేరాత్ బజార్‌లో కత్తిని కొనుగోలు చేశాడు. ఈ క్రమంలోనే ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువు తాహెరా బేగాన్ని పరామర్శించేందుకు గురువారం అర్ధరాత్రి బార్కాస్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ గఫార్, మహ్మద్ అబ్దుల్లా, అర్బాజ్ హమీద్‌లు ఆటోలో వెళ్తున్నారు. ముర్గీ చౌక్ వద్దకు రాగానే యాక్టివాపై వచ్చిన వాజిద్, ఇక్బాల్ ఆటోను అడ్డుకొని కత్తితో బెదిరించి రెండు సెల్‌ఫోన్లు, రూ.4500లు లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి 12 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్, హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి, డీఐ స్వామి పాల్గొన్నారు.

### వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

విజయనగర్‌కాలనీ: నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష పడిన ఘటన శుక్రవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కండేయ నగర్‌కు చెందిన కిషన్ (30) 2014 ఏప్రిల్ 28న రాత్రి 9 గంటలకు టాటాఏస్‌లో లక్ష్మీనగర్ నుంచి గుడిమల్కాపూర్‌కు వెళ్తున్నాడు. కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డు దాటుతున్న మహ్మద్ చాంద్‌ను ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 2014 ఏప్రిల్ 29న ఉదయం 3 గంటలకు మృతిచెందాడు. కేసు నమోదు చేసుకున్న అప్పటి ఎస్ఐ ఉపేందర్ దర్యాప్తు చేపట్టిన అనంతరం శుక్రవారం నాంపల్లి మెట్రోపాలిటన్ న్యాయమూర్తి ఎం.రాజేందర్ నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 ప్రమాద రుసుము విధించారు.

### ఈ-పెట్టీ కేసుల్లో ముగ్గురికి జైలు

దూద్‌బౌలి: ఈ–పెట్టీ కేసుల్లో ముగ్గురు నిందితులకు నాంపల్లిలోని 1వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ లలిత 6 రోజుల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం..చార్మినార్ పోలీస్‌స్టేషన్ పరిధి దూద్‌బౌలికి చెందిన ఉస్మాన్ అలీ ఖాన్ (45), యాకుత్‌పురాకు చెందిన వసీం ఖాన్ (35), సయ్యద్ అబ్బాస్ అలీ (22)లపై ఈ–పెట్టీ కేసులను నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచగా 1వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ లలిత ముగ్గురు నిందితులకు 6 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

జియాగూడ: మద్యం తాగి కిందపడి గాయాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కృష్ణవేణి తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్ జైన్ మందిర్ ప్రాంతంలో ఉంటున్న సుమన్ (40) బ్యాండ్ వాయిస్తుంటాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై గురువారం రాత్రి మద్యం తాగి ఇంటి వద్ద కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.